

# నవభూమి

ఆదిలాబాద్

అనుబంధం

13 మే,2025 మంగళవారం పేజీలు:5

www.epaper.navabhoomi.in


జై జవాన్.. ఆపరేషన్ సిందూర్‌కు


## సబ్బండ వర్గాల మద్దతు



**ఇంద్రవెల్లి, -నవభూమి:** బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ, మండల యూత్ సభ్యులు, కుల సంఘాల నాయకులు, ప్రజలు, వ్యాపారస్తులు ర్యాలీ తీశారు. ఆర్మీ జవాన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. తెలంగాణ తల్లి చౌక్ నుంచి అంబేద్కర్ చౌక్ వరకు వెలిగించిన కొవ్వొత్తులతో ర్యాలీ తీశారు. పాకిస్థాన్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ మారుతి పటేల్ డోంగ్రే, ఏఎంసీ చైర్మన్ ముకాడే ఉత్తమ్, మాజీ ఎంపీపీ కనక తుకారాం, బీజేపీ మండలాధ్యక్షులు కేంద్రే బాలాజీ, మాజీ మండలాధ్యక్షులు ఆరెల్లి రాజలింగు, నాయకులు పాల్గొన్నారు. ఉపాధి కూలీల నివాళి రాంసింగ్‌తాండకు చెందిన ఉపాధి హామీ కూలీలు శనివారం అమరవీరుడు వీర జవాన్ మురళీ నాయక్‌కు నివాళులు అర్పించారు. కూలీలు జోహార్, జోహార్ మురళినాయక్ అంటు నినాదాలు చేశారు. ఇందులో ఉపాధి కూలీలు, గ్రామస్తులు పాల్గొన్నారు. సక్సెస్ కావాలని ర్యాలీ ఆపరేషన్ సిందూర్ విజయవంతం కావాలని కోరుతూ ఆష్టా గ్రామంలో విద్యార్థులు, గ్రామపెద్దలు, యువకులు భారీ ర్యాలీ నిర్వహించారు. దీంతోపాటు పహల్గాంలో మృతి చెందిన వారితోపాటు యుద్ధంలో వీరమరణం పొందిన జవాన్‌లకు నివాళులర్పించారు. బాసరలో ప్రత్యేక పూజలు దేశంలో నెలకొన్న యుద్ధ వాతావరణం సందర్భంగా శనివారం బాసర సరస్వతీ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవస్థాన వైదిక బృందం ప్రత్యేక సంకల్పం చెప్పి అమ్మవారి మూలవిరాట్‌కి ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం అభిషేక అనంతరం అర్చన సమయంలో సామూహికంగా భక్తులందరి చేత దేశప్రజల రక్షణ, రక్షణశాఖకు అమ్మవారి పరిపూర్ణ అనుగ్రహం లభించాలని శత్రుదేశం యొక్క దుర్బుద్ధి నాశనం కావాలని, దేశ సరిహద్దుల్లో ప్రాణాలకు తెగించి పోరాడుతున్న త్రివిధ దళాధిపతులకు ఆత్మైస్థైర్యం, బహుబుద్ధి బలం, మనోధైర్యం అమ్మవారు కల్పించాలని భక్తులతో విశేశ సంకల్పం చేయించారు. హనుమాన్ చాలీసా చదువుతూ సంఘీభావం కప్పర్ల గ్రామంలోని రామాల యంలో శనివారం ఐదుసార్లు సామూహిక హనుమాన్ చాలీసా, హనుమాన్ దండకం, రామరక్ష స్తోత్రం పఠించారు. పహాల్గాంలో ఉగ్రవాదులు దాడి నేపథ్యంలో భారత్, పాకిస్థాన్ దేశాల మధ్య యుద్ధ మేఘాలు కమ్ముకున్న నేపథ్యం లో సంఘీభావంగా వేద పండితులు విశాల్ శర్మ సమక్షంలో చాలీసా పఠించి సంఘీభావం తెలిపారు. పోలీసుల పహారా మహారాష్ట్ర సరిహద్దుకు ఆనుకుని కుభీర్ మండలం ఉండడంతో పాకిస్తాన్‌కు చెందిన వారు చొరబడే అవకాశం ఉన్నందున పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. నిగ్వ, డోడర్న, సిర్పెల్లి తండా, బెల్గాం మార్లగొండ గ్రామాల్లో ప్రజలను అప్రమత్తం చేశారు. గుర్తు తెలియని వ్యక్తులు కనిపిస్తే ఆధార్ కార్డు చూపించమని అడగాలని, లేని పక్షంలో పోలీసులకు సమాచారం అందించాలని సూచిస్తున్నట్లు ఎస్సై రవీందర్ తెలిపారు.

'పది' ఫలితాల్లో ఎస్సీ బాలుర

## వసతి గృహం విద్యార్థుల ప్రతిభ





12న ఆర్మీ జవాన్లకు మద్దతుగా

## భారీ ర్యాలీ



**ఎదులాపురం,-నవభూమి:** భారత ఆర్మీ దళానికి అండగా నిలుస్తూ.. వారి ధైర్య, సాహసాలను చేకూరుస్తూ ప్రతి భారతీయుడు అండగా నిలవాలని మాజీ మంత్రి జోగు రామన్న అన్నారు. శనివారం బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో కార్యకర్తలతో ముఖ్య సమావేశాన్ని ఏర్పాటు చేసి భారత్-పాకిస్తాన్ యుద్ధ అంశాలపై చర్చించారు. భారత్ ఆర్మీ సేవలను కొనియాడారు. ఈనెల 12వ తేదీ(సోమవారం)న బీఆర్ఎస్ పార్టీ కార్యాలయం నుంచి భారత ఆర్మీ అమరులకు నివాళులు అర్పిస్తూ ర్యాలీ నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీలకు అతీతంగా ప్రతి ఒకరూ పాల్గొని జాతీయ భావాన్ని చాటి చెప్పేలా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. సోమవారం సాయంత్రం ఐదు గంటలకు జిల్లా పార్టీ కార్యాలయం నుంచి ప్రధాన వీధుల గుండా ర్యాలీ ఉంటుందన్నారు. కుమ్రం భీం చౌరస్తా, తెలంగాణ తల్లి చౌక్, వినాయక చౌక్ మీదుగా అమరులకు నివాళులు అర్పించి అశోక్ రోడ్, గాంధీచౌక్, అంబేదర్ చౌక్‌లో మానవహారం చేపట్టి నివాళులు అర్పిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇజ్జగిరి నారాయణ, పట్టణ అధ్యక్షుడు అజయ్, యునీస్ అక్బాని, సాజిదుద్దీన్, మెట్టు ప్రహ్లాద్, లింగారెడ్డి, మారిశెట్టి గోవర్ధన్ పాల్గొన్నారు.

మహాలక్ష్మీ డబ్బు లేవీ..

## ఎదురుచూస్తున్న లబ్ధిదారులు



## ఆధునిక పద్ధతులతో వ్యవసాయంలో అధిక లాభాలు : వ్యవసాయ అధికారులు




**ఉట్నూర్ -నవభూమి:** రైతులు సాంప్రదాయ విధానాలు వీడి ఆధునిక పద్ధతుల ద్వారా వ్యవసాయం చేస్తే అధిక దిగుబడులతో పాటు లాభాలు వస్తాయని వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారులు సూచించారు. మండలంలోని షాంపూర్ గ్రామంలో సోమవారం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వ్యవసాయంలో తక్కువ యూరియా వాడకం, అవసరం మేరకు రసాయన మందులను వినియోగించడం, ఎరువులు, పురుగు మందులు , గడ్డి మందుల రసీదులను భద్రపరచడం, సాగునీటి ఆదా చేయడం, పంట మార్పిడి పద్ధతి, చెట్లను పెంచి పర్యావరణాన్ని కాపాడడం వంటి ఆరు అంశాల గురించి వివరించారు. జిల్లాలో సాగుచేసే ముఖ్యమైన పంట పత్తిలో అధిక సాంద్రత పద్ధతిలో సాగుపై చర్చించారు. మండల వ్యవసాయ అధికారి రమేష్ మాట్లాడుతూ వ్యవసాయంలో సాంకేతిక పద్ధతులు , ప్రభుత్వ%శీ% అందిస్తున్న సహాయ సహకారాలను వివరించారు. ఉద్యాన అధికారి క్రాంతి కుమార్ ,మండల పశువైద్యాధికారి డాక్టర్ విజయ్ కుమార్, సెంటర్ ఫర్ పీపుల్స్ ఫారెస్ట్రి ఎన్జీవో ప్రతినిధి కె సత్యనారాయణ , వ్యవసాయ కళాశాల శాస్త్రవేత్తలు డాక్టర్ ఎం సురేష్, అసిస్టెంట్ ప్రొఫెసర్ , టీచింగ్ అసోసియేట్స్ డాక్టర్ ఎస్ కిరణ్ రెడ్డి, డాక్టర్ కె మౌనిక, ఆయా శాఖ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

## అధికారిక లాంఛనాలతో సీఆర్పీఎఫ్ జవాన్‌కు వీడ్కోలు.. పాల్గొన్న ఎమ్మెల్యే అనిల్ యాదవ్

**బజార్‌హత్నూర్ -నవభూమి:** సీఆర్పీఎఫ్ జవాన్‌గా జార?ండ్‌లో విధులు నిర్వహిస్తున్న మండలంలోని జాతర్ల గ్రామానికి చెందిన ఆర్క మేఘనాథ్ విధులు నిర్వహిస్తూ అనారోగ్యంతో మృతి చెందాడు. ఆయన పార్థివదేహాన్ని స్వగ్రామానికి సోమవారం ఉదయం తీసుకువచ్చారు. ఈ సందర్భంగా స్థానికులు, పోలీసులు, ప్రజాప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొని అంతిమ యాత్రలో పాల్గొని నివాళి అర్పించారు. పోలీస్ స్టేషన్ నుంచి జాతర్ల గ్రామం వరకు యువకులు, గ్రామస్థులు, వివిధ పార్టీల నాయకులు జాతీయ జెండాలతో బైక్ ర్యాలీ నిర్వహించారు. బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాధవ్ జాతర్లలో జరిగిన అంతః క్రియల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జవాన్ మేఘనాథ్ భౌతికకాయానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. జవాన్ కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఎమ్మెల్యే అనిల్ జాదవ్ మాట్లాడుతూ కుటుంబానికి దూరంగా వెళ్లి దేశ సేవ చేసే అవకాశం దొరకడం అదృష్టమని, అనారోగ్యంతో జవాన్ మేఘనాథ్ చనిపోవడం బాధాకరమని పేర్కొన్నారు. మేఘనాథ్ కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉండేలా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానన్నారు. గిరిజన శాఖ ద్వారా కుటుంబానికి న్యాయం జరిగిలా చూస్తానని హామీ ఇచ్చారు. అంతకు ముందు ప్రభుత్వ లాంఛనాలతో సీఆర్పీఎఫ్ అసిస్టెంట్ కమాండర్ వినయ్ రెడ్డి, జవాన్లు పార్థివ దేహంపై జాతీయ జెండాను కప్పి గౌరవ వందనం చేపట్టి దహన సంస్కారాలు చేపట్టారు.



### సారు.. సక్సెస్.. కోటపల్లి ఎస్ఐ కృషి.. 'పది' ఫలితాల్లో ఎస్సీ బాలుర

# వసతి గృహం విద్యార్థుల ప్రతిభ

**కోటపల్లి,-నవభూమి:** కోటపల్లి ఎస్ఐ రాజేందర్ కృషి ఫలితంగా స్థానిక ఎస్సీ బాలుర వసతి గృహం విద్యార్థులు పది పరీక్షల్లో 100 శాతం ఉత్తీర్ణత సాధించారు. విధి నిర్వహణలో తీరిక లేకుండా ఉండే ఉద్యోగం చేస్తూనే.. ఉపాధ్యాయుడిగా విద్యార్థులకు పాఠాలు బోధించి, ఉత్తమ ఫలితాలు రాబట్టారు. వ్యవసాయ కుటుంబానికి చెందిన ఆయన, ప్రభుత్వ పాఠశాలలు, వసతి గృహాల్లో చదువుకొనే ఉద్యోగం సాధించారు. చదువుతోనే ప్రగతి సాధ్యమని, కష్టపడితే సాధించలేదని లేదని నమ్మి పేద విద్యార్థులు చదువు వైపు దృష్టిపెట్టేలా ప్రణాళిక రూపొందించారు. ఇందులో ప్రతి రోజూ సాయంత్రం ఈ వసతి గృహాన్ని సందర్శిస్తూ విద్యార్థులను చదువువైపు ప్రోత్సహించారు. సాయంత్రం 7 నుంచి రాత్రి 9 గంటల వరకు ప్రత్యేక తరగతులు నిర్వహించారు. వారికి స్నాక్స్‌తో పాటు, అవసరమైన స్టడీ మెటీరియల్ అందిస్తూ వెన్నుతట్టారు. పరీక్షలపై భయాన్ని తొలగించడంతో పాటు, ఉత్సహంగా పరీక్షలు రాసేందుకు తన అనుభవాలను చెప్తుండేవారు. ఏ విషయంలో సందేహాలున్నా తన అనుభవంతో పరిష్కరిస్తూ వారిలో ఉత్సాహం నింపిన ఈ ఎస్ఐ.. విద్యార్థుల పాలిట 'సార్..' అయ్యారు. ఇక్కడ చదివిన 23 మందికి 23 మంది విద్యార్థులు ఉత్తీర్ణులవగా, సార్‌కు కృతజ్ఞతలు తెలుపుతున్నారు. సార్ కృషి వల్లే ఉత్తీర్ణులమయ్యాం..కోటపల్లి ఎస్ఐ సార్ కృషి వల్లే 100 శాతం ఉత్తీర్ణత సాధించాం. కోటపల్లి మోడల్ స్కూల్‌లో విద్యాబోధన అనంతరం హాస్టల్‌కు వచ్చిన తర్వాత చదవకుండా కాలక్షేపం చేసేవాళ్లం. కానీ మా హాస్టల్‌పై సార్ ప్రత్యేక దృష్టి పెట్టి, రోజూ సాయంత్రం సందర్శించేవారు. ప్రత్యేక తరగతులు నిర్వహిస్తూ పాఠాలు బోధించడం వల్ల సక్సెస్ అయ్యాం. పట్టుబట్టి చదివితే మంచి ఫలితాలు సాధించవచ్చని ఆయనను చూసే నేర్చుకున్నాం. సూచనలు, సలహాలతో ఉన్నతంగా చదివి మంచి కొలువులు సాధిస్తాం. ఓంకార్, విద్యార్థి మంచి ఫలితాలు వచ్చాయి..పదో తరగతి విద్యార్థులపై కోటపల్లి ఎస్ఐ రాజేందర్ ప్రత్యేక దృష్టిపెట్టారు. అందువల్లే వారు మంచి ఫలితాలు సాధించాం.



ప్రతిరోజూ మా వసతి గృహాన్ని ఎస్ఐ స్థాయి అధికారి సందర్శించడం వల్ల విద్యార్థులు చదువుపై దృష్టిపెట్టారు. విద్యార్థులు చెడువైపు పయణించకుండా ఆయన చేసిన కృషి అభినందనీయం. ఇలా ప్రతీ వసతి గృహాన్ని మండలస్థాయి అధికారులు దత్తత తీసుకుంటే విద్యార్థుల్లో ఆత్మస్థైర్యం పెరుగుతుంది. దీంతో పాటు, మంచి ఫలితాలు కూడా సాధించవచ్చు. మల్లేశ్, సంక్షేమాధికారి, ఎస్సీ హాస్టల్, కోటపల్లి విద్యతోనే ప్రగతి సాధ్యం..విద్యార్థి దశలో ముఖ్యమైన దశ పదోతరగతి. ఈ దశలో విద్యార్థులు సన్మార్గంలో నడిస్తేనే ప్రయోజకులవుతారు. విద్యతోనే ప్రగతి సాధ్యం. వసతి గృహాల్లో చదువుకుంటున్న విద్యార్థులపై ప్రత్యేక దృష్టి పెడితే అద్భుతాలు సాధించవచ్చు. నేనూ వసతి గృహంలో ఉంటూనే చదవుకొని ఈ స్థాయిలో ఉన్నా. కోటపల్లి ఎస్సీ బాలుర వసతి గృహంపై ప్రత్యేక దృష్టి పెట్టా. మా ఉన్నతాధికారుల సూచనలు, సలహాలు తీసుకుంటూ ముందుకు సాగుతూ విద్యార్థులను పది పరీక్షలకు సన్నద్ధం చేసి విజయం సాధించా.

### మహాలక్ష్మీ డబ్బు లేవీ..

# ఎదురుచూస్తున్న లబ్ధిదారులు

**ఆదిలాబాద్,-నవభూమి:** కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు నామమాత్రంగా మారుతున్నాయి. రూ.2 లక్షల రుణమాఫీ, రైతు భరోసా పథకాలు పూర్తిస్థాయిలో అమలు కాకపోగా, ఆరు గ్యారెంటీల్లో భాగంగా ఆర్భాటంగా ప్రకటించిన మహాలక్ష్మి పథకం ప్రచారానికే పరిమితమవుతున్నది. ఈ పథకంలో భాగంగా కాంగ్రెస్ ప్రభుత్వం రూ.500 గ్యాస్ సిలిండర్‌ను పంపిణీ చేస్తున్నట్లు ప్రకటించింది. గతేడాది ఫిబ్రవరి 27న ప్రారంభించారు. రేషన్‌కార్డులు కలిగిన వారు పథకానికి అర్హులు అని ప్రకటించడంతో ప్రజాపాలనలో జనం రూ.500 సిలిండర్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. పథకం ప్రారంభంలో చాలా మందికి సబ్సిడీ సిలిండర్‌లు పంపిణీ కాలేదు. దీంతో మున్సిపల్ కార్యాలయాలు, గ్రామ పంచాయతీల్లో ఏర్పాటు చేసిన ప్రజాపాలన కేంద్రాల్లో దరఖాస్తులుదారులు మరోసారి తమ వివరాలను సమర్పించారు. మహాలక్ష్మి పథకంలో భాగంగా రూ.500 సిలిండర్ పొందాలంటే రేషన్‌కార్డు తప్పనిసరితోపాటు ఇతర నిబంధనల కారణంగా చాలా మంది పేదలు సబ్సిడీ సిలిండర్‌లకు దూరమయ్యారు. రాయితీ కోసం ఎదురుచూపు ప్రజాపాలన దరఖాస్తులను పరిశీలించిన అధికారులు ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా 98,660 మంది అర్హులుగా గుర్తించారు. సి లిండర్ ధర రూ.882 ఉండగా కేంద్ర ప్రభుత్వం రూ. 47.38 సబ్సిడీ ఇస్తుండగా, రాష్ట్ర ప్రభుత్వ మహాలక్ష్మి ఫథకంలో భాగం గా రూ.334.62 రాయితీ ఇస్తుంది. లబ్ధిదారుడు గ్యాస్ సిలిండర్ బుక్ చేసుకున్న తర్వాత సంబంధిత గ్యాస్ ఏజెన్సీలు డెలివరీ చే స్తాయి. లబ్ధిదారుడు మొదటగా సిలిండర్ ధర మొత్తం రూ.882 చెల్లించాల్సి ఉంటుంది. అనంతరం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల స బ్సిడీలు వేర్వేరుగా లబ్ధిదారుడి బ్యాంకు ఖాతాల్లో జమ అవుతా యి. కేంద్ర ప్రభుత్వం ఇస్తున్న సబ్సిడీ రూ.47.38 ప్రతి వినియోగదారుడికి వస్తుంది. రాష్ట్ర ప్రభుత్వం మహాలక్ష్మి పథకంలో ఎం పిక చేసిన వారికి మాత్రం రాయితీ డబ్బులు లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో జమ కావడం లేదు. ఈ డబ్బులు ఎప్పుడు వస్తాయో? ఎప్పుడు రావో? తెలియని దుస్థితి నెలకున్నది. ఒక్కొక్కరికి మూ డు నెలల సమయం పడుతుండగా.. మరికొందరికి ఇంకా ఎక్కు వ సమయం పడుతుంది. లబ్ధిదారులు నెల నుంచి 45 రోజులకోక సిలిండర్ వారి అవసరాల మేరకు వాడుతుంటారు. వీరికి నెలల తరబడి సబ్సిడీ డబ్బులు జమపోవడంతో ఆందోళన చెం దుతున్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న మహాలక్ష్మి పథకం ద్వారా రూ.500 సిలిండర్ లబ్ధిదారులకు ప్రయోజనం చేకూరేలా చర్యలు తీసుకోవాలని జనం కోరుతున్నారు. ప్రయోజనం లేదు..మా ఐదో వార్డులో చాలా మందికి మహాలక్ష్మి పథకానికి సంబంధించి రూ.500 సిలిండర్ డబ్బులు రావ డం లేదు. చాలా మంది పేదలు మా దగ్గరికి వచ్చి మాకు గ్యాస్ సబ్సిడీ రావడం లేదని అంటున్నారు. ఈ విషయంలో ప్రజావాణిలో దరఖా స్తులు ఇచ్చినా ప్రయోజనం లేదు. సివిల్ సప్లయ్ అధికారులు, గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకులను సంప్రదించినా తాము ఏమీ చేయలేమని అంటున్నారు. ప్రభు త్వం సబ్సిడీ నేరుగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తు న్నదని సమాధానం ఇస్తున్నారు. సిలిండర్ తీసుకుని మూడు నెలలు దాటినా సబ్సిడీ వస్తలేదు. ప్రభుత్వం లబ్ధిదారులకు సిలిం డర్ రాయితీ డబ్బులు వచ్చేలా చర్యలు తీసుకోవాలి. శ్రీలత, మాజీ కౌన్సిలర్, ఆదిలాబాద్ ప్రచారానికే పరిమితమైంది..కాంగ్రెస్ ప్రభుత్వం ఆర్భాటంగా ప్రారం భించిన మహాలక్ష్మి పథకం ప్రచారానికే పరిమితమైంది. పేదలకు రూ.500 సిలిండర్ అందడం లేదు. సిలిండర్ తీసుకుని మూడు, నాలుగు నెలలు దాటినా సబ్సిడీ పైసలు రావడం లేదు. లబ్ధిదారులకు సబ్సిడీ డబ్బుల విషయంలో ఎవరిని అడగాలో తెలియడం లేదు. ప్రభుత్వం విధించిన నిబంధనల కారణంగా చాలా మంది పేదలకు మహాలక్ష్మి పథకం వర్తించడం లేదు. ఎంపిక చేసిన లబ్ధిదారులకు సబ్సిడీ డబ్బులు జమ కావడం లేదు. రూ.500 సిలిండర్ అంటూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను మోసం చేస్తున్నది.



## 'పానీ' పాట్లు.. ముల్కలమంద, తోయరేట్ గ్రామాల్లో నీటి కటకట



-నవభూమి: తిర్యాణి మండలం ముల్కలమంద, తోయరేట్ గ్రామాల్లో సుమారు 50 కుటుంబాలుండగా, వీరంతా తాగు నీటికి తండ్లాడాల్సి వస్తున్నది. మిషన్ భగీరథ పథకం ఉన్నప్పటికీ పైపులైన్లు సరిగా లేక గుక్కెడు నీటికోసం వేట సాగించాల్సిన దుస్థితి నెలకొన్నది. ముల్కల మంద గ్రామానికి అర కిలోమీటర్ దూరంలోని వ్యవసాయ బావే వీరికి దిక్కు కాగా, నిత్యం అక్కడికి వెళ్లి బావి గోడపై నిలబడి ప్రమాదకర పరిస్థితుల్లో నీరు తోడుకోవాల్సి వస్తున్నది. ఏ మాత్రం పట్టుతప్పినా బావిలో పడిపోయే అవకాశమున్నదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ఇక ఈ గ్రామాల్లోనే కాదు గుండాల, మంగి, తొక్కిగూడ, తాటిగూడ, గోపేర, లంబాడీతండా, గోవెన, కర్పుగూడ, కొలాంగూడ, బీంరాల్ల, బందర్‌గూడ, మొర్రిగూడ, లోహ, తోయరేటి, మంగర్‌మోడి, గోండర్‌గాం, బోర్డాం తదితర గ్రామాల్లోనూ గొంతు తడుపుకునేందుకు గిరిజనులు అష్టకష్టాలు పడుతున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి మిషన్ భగీరథ పైపులైన్‌కు మరమ్మతులు చేయించి తాగు నీరు సరఫరా చేయాలని వారు వేడుకుంటున్నారు.

## కేజీబీవీల అప్‌గ్రేడ్ కొత్తగా ఐదు కస్తూర్బాల్లో ఇంటర్ విద్య

**కోటపల్లి, -నవభూమి:** జిల్లాలో కొత్తగా ఐదు కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాలను అప్‌గ్రేడ్ చేయగా, ఈ విద్యా సంవత్సరం నుంచే ఇంటర్ విద్య అమల్లోకి రానున్నది. జిల్లాలో మొత్తం 18 కేజీబీవీలు ఉండగా, గతంలో 10 చోట్ల ఇంటర్ విద్య ప్రారంభమైంది. మిగతా ఎనిమిది పాఠశాలల్లో ఇంటర్ విద్య ప్రారంభించాల్సి ఉండగా, ఈ విద్యా సంవత్సరం నుంచి కోటపల్లి, వేమనపల్లి, హాజీపూర్, కన్నెపల్లి, దండేపల్లి కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాల్లో అందుబాటులోకి తీసుకొచ్చేందుకు సంబంధిత శాఖ చర్యలు చేపట్టింది. ఇక కాసిపేట, భీమిని, భీమారం మండలాల్లోని కేజీబీవీల్లో ఇంటర్ ప్రారంభించాల్సి ఉండగా, సౌకర్యాల లేమి కారణంగా అప్‌గ్రేడ్ చేయలేదు.ఒక్కో గ్రూప్‌లో 40 సీట్లు కస్తూర్బాల్లో ఇంటర్ ప్రారంభం కానుండగా, ఒక్కో గ్రూప్‌లో 40 సీట్లు ఉండనున్నాయి. కానీ, ఆయాచోట్ల సరైన సౌకర్యాలు లేని కారణంగా ఒక్కోచోట ఒక్కో గ్రూప్‌లో మాత్రమే అడ్మిషన్లు తీసుకోనున్నారు. ఇంటర్ అప్‌గ్రేడ్ చేసిన కస్తూర్బాల్లో మరిన్ని సౌకర్యాలు కల్పిస్తే విద్యార్థినులకు మరింత ప్రయోజనం చేకూరనున్నది.బాలికల విద్యకు బాసట కేజీబీవీల్లో ఇంటర్ విద్య ప్రారంభం కావడంతో బాలికా విద్యకు మరింత బాసట కలగనున్నది. కస్తూర్బా గాంధీ బాలికల విద్యాయాలు ఇప్పటికే సత్ఫలితాలను సాధిస్తున్నాయి. నిరుపేద, నిరాశ్రయులైన బాలికలను అక్కున చేర్చుకొని మెరుగైన విద్యను అందిస్తూ ముందుకు సాగుతున్నాయి. కేజీబీవీల అప్‌గ్రేడ్‌తో విద్యార్థినులు పదో తరగతితో ఆగకుండా ఇంటర్‌ను కూడా అదే పాఠశాలలో పూర్తి చేసే అవకాశం కలిగింది.సద్వినియోగం చేసుకోవాలి కోటపల్లి కేజీబీవీలో ఈ విద్యాసంవత్సరం నుంచే ఇంటర్ తరగతులు ప్రారంభిస్తాం. కొత్తగా బైపీసీ గ్రూప్‌ను ప్రారంభించి విద్యార్థులకు పాఠాలు బోధించేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం. కేజీబీవీల్లో ఇంటర్ విద్య అమలు చేయడం వల్ల విద్యార్థినుల చదువు మధ్యలో ఆగిపోకుండా ఉంటుంది. కేజీబీవీల్లో నాణ్యమైన విద్య అందుతున్నది. విద్యార్థినులు సద్వినియోగం చేసుకోవాలి.



### అటకెక్కిన టూరిజం కారిడార్..

# ఏడాదిన్నరగా కాగితాలకే పరిమితం




**నిర్మల్, -నవభూమి:** బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నిర్మల్ జిల్లాలోని చారిత్రక ప్రదేశాలతోపాటు ప్రకృతి సిద్ధమైన ప్రదేశాలను కేంద్రీకృతం చేస్తూ రూపొందించిన టూరిజం కారిడార్ ప్రతిపాదనలను ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. ఈ ప్రతిపాదనలు కాగితాలకే పరిమితం కా గా.. ఆచరణకు నోచుకోకపోవడంపై ప్రస్తుత ప్రభుత్వంపై స్థానికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. టూరిజంకు పూర్తి అనుకూలంగా ఉన్న నిర్మల్ జిల్లాను ప్ర భుత్వం నిర్లక్ష్యం చేస్తున్నదన్న విమర్శలు ఉన్నాయి. ముఖ్యంగా బాసర సరస్వతీ దేవి ఆలయం నుంచి మొదలుకుని కదిలి పాపహరేశ్వర ఆలయం, కాల్వ లక్ష్మీనరసింహ ఆలయాలతో ఈ కారిడార్‌ను నిర్మల్‌లోని చారిత్రక కట్టడాలు, కొయ్యబొమ్మలతోపాటు కడెం, సదర్మాట్, ఎస్సారెస్పీ ప్రాజెక్టులను కలుపుకుని కవ్వాల్ టైగర్ జోన్ వరకు ఈ కారిడార్ ఏర్పాటు కోసం బీఆర్ఎస్ హయాంలో ప్రతిపాదనలను రూపొందించారు.అప్పటి ప్రభుత్వం పర్యాటకరంగా అభివృద్ధిని బహుళ ప్రయోజనాల కోసం ఉపయోగించుకోవాలని యాక్షన్ ప్లాన్ తయా రు చేసింది. స్థానిక ప్రకృతి పరమైన ప్రదేశాలను అభివృద్ధి చేస్తూనే, స్థానికులకు ఈ రంగం ద్వారా ఉపాధి కల్పించాలన్నదే కారిడార్ ప్రధాన లక్ష్యంగా నిర్ధారించారు. దీని కోసం అప్పటి ప్రభుత్వం నిధులు మంజూరు చేసేందుకు ముందుకొచ్చింది. ఈలోగా అసెంబ్లీ ఎన్నికలు రావడం, రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంతో పనులు నిలిచాయి. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 16 నెలలు దాటుతున్నప్పటికీ ఇప్పటివరకు నయాపైసా విదల్చలేదు. అప్పటి ప్రభుత్వం ఈ టూరిజం కారిడార్‌ను పీపీపీ(పబ్లిక్ ప్రైవేటు పార్టిసిపేషన్) పద్ధతిలో ఏర్పాటు చేయాలని నిర్ణయించడమే కాకుండా ఇందుకోసం అవసరమైన చర్యలను చేపట్టింది. అయితే ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఈ విధానంపై ఇప్పటి వరకు ఒక్క అడుగు కూడా ముందుకు వేయలేదు. చాలా చోట్ల పీపీపీ విధానంతో పర్యాటకరంగం అభివృద్ధి సాధిస్తున్నప్పటికీ ప్రస్తుత ప్రభుత్వ నిర్వాకం కారణంగా ఈ రంగం నీరుగారుతున్నది.కవ్వాల్‌పైనా నిర్లక్ష్యమే..సహజ సిద్ధమైన ప్రకృతి సంపదతో కళకళలాగే కవ్వాల్ టైగర్ జోన్‌పైనా కాం గ్రెస్ సర్కారు నిర్లక్ష్యం వహిస్తున్నది. బీఆర్ఎస్ ప్రభుత్వం టూరిజం కారిడార్ ఏర్పాటులో భాగంగా తడోబా తరహాలో ఇక్కడ అభివృద్ధి చేయాలని తలపెట్టింది. టైగర్ జోన్ పరిధిలోని 78 వేల హెక్టార్ల నుంచి 20 శాతం మేర కోర్, బఫర్ ఏరియాలను టూరిజం స్పాట్‌లుగా తీర్చిదిద్దాలని భావించింది. ఎకో టూరిజం పేరిట టూరిస్టులను ఆకర్షించేందుకు కోర్, బఫర్ ఏరియాలను పూర్తి స్థాయిలో అభివృద్ధి చేయాలని అప్పటి ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో భాగంగా కవ్వాల్ టైగర్ జోన్‌ను తిలకించేందుకు ఐదు సఫారీ వాహనాలను సమకూర్చేందుకు రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ నుంచి ఆర్థిక సహకారం తీసుకునేందుకు నిర్ణయించారు. ఆర్థిక భారం పడకుండా పీపీపీ విధానంలో నిర్వహించేందుకు అటవీశాఖ ముందుకొచ్చింది. కవ్వాల్ పరిధిలోని కడెం, గంగాపూర్, ఎక్బాల్‌పూర్, ఉడుంపూర్, ఆకొండపేట ప్రాంతాలను ఈ టూరిజం కారిడార్ కిందకు తీసుకొచ్చారు. ఉడుంపూర్ అటవీ రేంజ్ పరిధిలోని కల్లెడ గ్రామం వద్ద నిర్మల్-మంచిర్యాల ప్రధాన రహదారి పక్కన కేసీఆర్ ప్రభుత్వం ఏర్పాటు చేసిన 'ఐ లవ్ కవ్వాల్' అనే లోగో అటువైపు వెళ్లే వారిని విశేషంగా ఆకట్టుకుంటున్నది. ఈ ప్రాంతం నుంచి మైసంపేట, గంగాపూర్, లక్ష్మీపూర్ ప్రాంతాలను సందర్శించేందుకు ప్రత్యేకంగా సఫారీని ఏర్పాటు చేయాలని బీఆర్ఎస్ ప్రభు త్వం నిర్ణయించింది. ఇందులో భాగంగానే దిమ్మదుర్తి, జన్నారంల వద్ద మొత్తం 22 కాటేజీలను టూరిస్టుల విడిది కోసం నిర్మించాలని తలపెట్టారు. కాగా ఈ ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి ఇప్పటి వరకు వీటి నిర్మాణం కోసం ఒక్క అడుగు ముందుకు పడలేదు.పీపీపీ పద్ధతిలో నిర్వహణకు ప్రతిపాదనలు ఎకో టూరిజంలో భాగంగా కవ్వాల్ టైగర్ జోన్‌ను టూరిస్టు స్పాట్‌గా ఏ ర్పాటు చేయాలని భావించిన బీఆర్ఎస్ ప్రభుత్వం దాని బాధ్యతను పబ్లిక్ ప్రైవేటు పార్టిసిపేషన్ (పీపీపీ) విధానంలో చేపట్టాలని ప్రణాళికలు రూపొందించింది. ఆర్థిక, నిర్వహణ పరంగా భారం కాకుండా టైగర్ జోన్ పరిధిలోని గ్రామాలకు చెందిన వీడీసీలు, అక్కడి యువకులకు సఫారీ వాహనా ల నిర్వహణ బాధ్యతలను అప్పగించాలని భావించారు. ఫారెస్ట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ద్వారా ఈ వాహనాలను కొనుగోలు చేసి, స్థానిక యు వకులకు రుణాలు అందించి వాహనాలు వారికి అప్పగిస్తే అటు టూరిజంతోపాటు ఇటు యువతకు ఉపాధి కల్పించవచ్చున్న ఆలోచనను అప్పటి ప్రభుత్వం చేసింది. అంతేకాకుండా స్థానిక పరిస్థితులపై అవగాహన ఉం డి, అక్కడి చెట్లు, జంతువుల వివరాలు తెలిసిన వారిని టూరిస్టు గైడ్‌లుగా నియమించాలని నిర్ణయించారు. ఇలా జిల్లాలోని సహజ వనరులతోపాటు ఇక్కడి ఆధ్యాత్మికతను బయటి ప్రపంచానికి తెలియజేసేందుకు గత కేసీఆర్ ప్రభుత్వం ముందుచూపుతో ప్రణాళికలు సిద్ధం చేసింది. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఆ ఊసే లేదు. గత 16 నెలల కాలంలో పర్యాటకరంగ అభివృద్ధికి నయాపైసా విడుదల చేయకపోవడంతో గత ప్రభుత్వ ప్రణాళికలన్నీ బుట్టదాఖలయ్యాయి. ఇప్పటికైనా ప్రభుత్వం జిల్లాలో టూరిజం అభివృద్ధికి నిధులు కేటాయించి పనులు మొదలు పెట్టాలని జిల్లా ప్రజలు కోరుతున్నారు.

# జీపీ భవనం పూర్తయ్యేదెన్నడో..

**ఖానాపూర్ -నవభూమి:** అడవి సారంగాపూర్ గ్రామస్తులు ఎన్నో ఏళ్లు ఎదురుచూడగా బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నూతన గ్రామపంచాయతీ కార్యాలయానికి భవనం మంజూరైంది. భవన నిర్మాణ పనులను కాంట్రాక్టర్ ప్రారంభించినప్పటికీ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో బిల్లుల చెల్లింపు లేకపోవడంతో పనులు నిలిచిపోయాయి. అప్పటి నుంచి గ్రామ పంచాయతీ కార్యాలయానికి భవనం లేక సిబ్బందితో పాటు గ్రామస్తులు ఇబ్బంది పడుతున్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఆదివాసుల సంక్షేమానికి ఐటీడీఏ శాఖ నుంచి రూ.20 లక్షలతో నూతన గ్రామపంచాయతీని మంజూరు చేసింది. అప్పుడు కాంట్రాక్టర్ ప్రారంభంలో స్లాబ్ వేశారు. ఆ తర్వాత వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం పంచాయతీ పనులకు బిల్లులు ఇవ్వకపోగా మధ్యలోనే ఎక్కడిపనులు అక్కడే నిలిచి పోయాయి.పైలెట్ గ్రామంపై పట్టింపేది ?తెలంగాణ ప్రభుత్వం ఆరు గ్యారెంటీల అమలు కోసం దశల వారీగా మండలానికి ఒక్క గ్రామ పంచాయతీని పైలెట్ గ్రామంగా ఎంపిక చేశారు. ఇందులో భాగంగా ఖానాపూర్ మండలంలోని ఆదివాసీ గ్రామమైన అడవి సారంగాపూర్‌ను ఎంపిక చేశారు. నిరంతరం సంక్షేమ పథకాల అమలు కోసం వస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులకు నిలబడుదామంటే నీడ లేదని, అయినా గ్రామపంచాయతీ కార్యాలయ భవన నిర్మాణాన్ని పట్టించుకోవడం లేదని గ్రామస్తులు విమర్శిస్తున్నారు. సంక్షేమ పథకాల అందించేందుకు, గ్రామ పంచాయతీ కార్యకలాపాలకు కార్యాలయం లేక ఇబ్బందిగా మారిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.బిల్లులు వస్తలేవని పనులు చేస్తలేరు..నేను ఖానాపూర్ మండలంలోని అడవి సారంగాపూర్ గ్రామ పంచాయతీకి చెందిన సర్పంచ్ మాడావి లింగు భర్త మాడావి జంగుని. మాకు ఐటీడీఏ నుంచి రూ. 20 లక్షల పంచాయతీ భవనం మంజూరైంది. మూడేళ్ల కింద పనులు ప్రారంభించారు. బిల్లులు వస్తలేవని పనులు నిలిపివేశారు. గ్రామ పంచాయతీ సమావేశాలు చెట్ల కిందనే నిర్వహిస్తున్నాం. ఫారెస్టుకు చెందిన ఒక్క గదిని అద్దెకు తీసుకొని అందులో రిజిస్టర్లు ఉంచాము. ఐటీడీఏ శాఖ అధికారులకు ఫోన్లు చేస్తే బిల్లులు వస్తలేవు మేము ఎం చేయాలని అంటున్నారు. గ్రామానికి అధికారులు ఎన్నో సార్లు వస్తున్నా గ్రామ పంచాయతీ భవనం పనులు పట్టించుకుంట లేరు.-మాడావి జంగు, గ్రామస్తుడు అధికారులు వస్తే నిలబడుదామంటే నీడ లేదు..కాంగ్రెస్ ప్రభుత్వంలో ఆరు గ్యారెంటీల అమలులో భాగంగా మా గ్రామాన్ని ఇటీవల పైలెట్ గ్రామంగా ఎంపిక చేశారు. సంక్షేమ పథకాల అమలు కోసం నిత్యం ఏదో ఒక శాఖకు చెందిన అధికారులు వస్తున్నారు. వాళ్లకు నిలబడుదామంటే నీడ లేదు. మండుటెండలో దినమంత చెట్లకింద ఉండి పనులు చేసుకుంటున్నారు. ఉన్నతాధికారుల పట్టించుకొని గ్రామపంచాయతీ పనులను జరిగేలా చూడాలి.



## పరీక్షలు పూర్తి చేసుకుని.. ఇంటికి తిరిగొస్తుండగా..



**సోన్,-నవభూమి:** పరీక్షలు పూర్తి కావడంతో తన కూతురును ఇంటికి కారులో తీసుకొస్తుండగా జరిగిన రోడ్డు ప్రమాదంలో తండ్రీకూతురు శంకర్(50), కృతిక(20) ప్రాణాలు కోల్పోయారు. ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని రవీందర్‌నగర్ కాలనీకి చెందిన శంకర్‌కు ఇద్దరు కూతుర్లు, ఒక కుమారుడు ఉన్నారు. చిన్న కూతురు కృతిక హైదరాబాద్‌లో బీటెక్ చదువుతోంది. పరీక్షలు ముగియడంతో తన తండ్రి శంకర్‌తో కలిసి కృతిక కారులో శనివారం రాత్రి భోజనం చేసి ఆదిలాబాద్‌కు పయానమయ్యారు. డ్రైవర్ విలాస్ కారు నడుపుతుండగా తన పక్క సీట్లో శంకర్, వెనక సీట్లో కూతురు కృతిక కూర్చున్నారు.జాతీయ రహదారి-44 వద్ద గల నీలాయిపేట్ హైవే దగ్గరికి వచ్చేసరికి డ్రైవర్‌కు నిద్ర వచ్చింది. దీంతో ముందు ఆపుకుని ఉన్న డీసీఎం వాహనాన్ని బలంగా ఢీకొట్టడంతో శంకర్, కృతికలు అక్కడికక్కడే మృతి చెందారు. డ్రైవర్ విలాస్‌కు తీవ్ర గాయాలు కాగా.. మహారాష్ట్రలోని యావత్మాల్‌కు మెరుగైన చికిత్స కోసం తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు నిర్మల్ రూరల్ ఎస్సై లింబాద్రి తెలిపారు. శంకర్ ఆదిలాబాద్‌లోని బ్యాటరీ దుకాణం వ్యాపారం నడుపుతున్నట్లు సమాచారం. ప్రమాదంలో తండ్రి, కూతురు మృతి చెందడంతో రవీందర్‌నగర్‌లోని విషాదఛాయలు అలుముకున్నాయి.

## 'దోస్త్ మేరా దోస్త్' అంటూ 22 ఏళ్ల తర్వాత కలిసిన పూర్వ విద్యార్థులు



**బజార్ హత్నూర్:-నవభూమి:** పదవ తరగతి పూర్తి చేసుకుని 22 సంవత్సరాలు గడిచిన తర్వాత పూర్వ విద్యార్థులంతా ఒక దగ్గర కలుసుకోవడం ఆనందంగా ఉందని బజార్ హత్నూర్ ఉన్నత పాఠశాలలో చదివిన 2003- 2004 పూర్వ విద్యార్థులు అన్నారు. ఆదివారం స్థానిక తిరుమల ఫంక్షన్ హాల్‌లో పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులతో కలిసి గెట్ టు గెదర్ ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా విద్యాబుద్ధులు నేర్పిన ప్రధానోపాధ్యాయులు రాజేశ్వర్ రెడ్డి, టి నారాయణను శాలువలతో సత్కరించి, అలనాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. విద్యార్థులు ఉపాధ్యాయులు తరగతి గదిలో జరిగిన గత స్మృతులను గుర్తు చేసుకున్నారు. ఉపాధ్యాయులు( %ఋఘఎష్ట్రవతీం% ) మాట్లాడుతూ విద్యార్థులు చదువులో రాణించి ఉన్నత స్థానంలో ఉంచాలన్నదే ఉపాధ్యాయుల ఉద్దేశమని అన్నారు. అయితే అప్పటి విద్యార్థులకు నేటి విద్యార్థులకు ఎంతో వ్యత్యాసం ఉందని పేర్కొన్నారు. టెక్నాలజీ వ్యవస్థ పెరగడంతో కొంతమంది విద్యార్థులు చెడు వైపు ప్రయాణిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటుచేసిన పూర్వ విద్యార్థులను అభినందించి మాట్లాడారు.

## ఆదిలాబాద్ జిల్లాలో విషాదం..లారీని ఢీకొట్టిన కారు: ఒకరి మృతి

**ఆదిలాబాద్ -నవభూమి:** ఆదిలాబాద్ జిల్లాలో విషాదం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. నేరడిగొండలోని రోల్ మామడ టోల్ ప్లాజా వద్ద ఆదివారం ఉదయం రోడ్డు ప్రమాదం(,%=శీఘఽ ఖఎఎఱఅవత్%) జరిగింది. రోడ్డుపై ఆగి ఉన్న లారీని నిర్మల్ వైపు వెళుతున్న కారు ఢీకొంది. ప్రమాదంలో కొత్తూర్ వాసి వెంకటేశ్ అక్కడికక్కడే మృతిచెందగా, అన్వేష్‌కు స్వల్పంగా గాయపడినట్లు ఎస్ఐ శ్రీకాంత్ తెలిపారు.సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని క్షతగాత్రుడిని హాస్పిటల్‌కు తరలించారు. మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం ప్రభుత్వ దవాఖానకు తరలించి కేసు నమోదు చసి దర్యాప్తు చేపట్టారు. ఈ ఘటనపై మరిన్ని వివరాలు తెలియాల్సి ఉంది.

# తోవ బంద్..రహదారికి ఇరువైపులా కాలువలు

**ఆదిలాబాద్, -నవభూమి:** ఆదిలాబాద్ జిల్లాలో చేపట్టిన జాతీయ రహదారి 353(బీ) నిర్మాణ పనులు రైతుల పాలిట శాపంగా మారాయి. మహారాష్ట్ర సరిహద్దు ఉపసనాల నుంచి భోరజ్ జాతీయ రహదారి-44ను కలిపేలా పనులు జరుగుతున్నాయి. బేల, జైనథ్ మండలాల మీదుగా 33 కిలోమీటర్ల మేర పనులు జరుగుతున్నా యి. ఆరు నెలల కిందట ప్రారంభమైన పనులు 2026 మే లోగా పూ ర్తి కావాలి. ప్రస్తుతం ఉన్న 7 మీటర్ల రో డ్డును 10 మీటర్ల వెడల్పుతో నిర్మిస్తున్నారు. రాష్ట్ర రహదారులు భవనాల శాఖ(నేషనల్ హైవే) విభాగం అధికారులు పనులను పర్యవేక్షిస్తున్నారు. రెండు వరుసల రోడ్డు వెడల్పులో భాగంగా వంతెనలు, వర్షం నీరు పోవడానికి రహదారికి ఇరువైపులా కాలువలు నిర్మిస్తున్నారు.రైతుల భూములకు ఆనుకుని డ్రెయిన్ నిర్మాణ పనులు సాగుతున్నాయి. దాదాపు మీటరు వెడల్పుతో నిర్మిస్తున్న కాలువల కారణంగా రైతులు తమ భూముల్లోకి పోవడానికి దారి లేకుండా పోతున్నది. వ్యవసాయ పనులు చేసుకోవాలంటే రైతులు వెడల్పుగా ఉన్న డ్రెయిన్‌లు దాటాలి. జిల్లాలో వానకాలం సీజన్‌కు రైతులు సన్నద్ధమవుతున్నారు. భూములను దున్నుతూ పంటలు వేయడానికి సిద్ధం చేస్తున్నారు. భూమి దున్నడానికి ట్రాక్టర్లతోపాటు ఎడ్లబండ్లు వెళ్లాలంటే కష్టంగా ఉంటుంది.పురుషులతోపాటు మహిళా రైతులకు కూడా కాలువలు దాటరాకుండా ఉంది. దాటే ప్రయత్నం చేస్తే పడిపోతే కా లు, చేయి విరగడంతోపాటు దెబ్బలు తాకి మంచాన పడుతామని రై తులు ఆవేదన చెందుతున్నారు. డ్రెయిన్ నిర్మించిన చోట ర్యాంపులు ఏర్పాటు



చేయకపోవడంతో తమ పొలాలకు ఎలా వెళ్లాలి? వ్యవసాయ పనులు ఎలా చేసుకోవాలో? తెలియడం లేదని ఆందోళన చెందుతున్నారు. అధికారులు స్పందించి తమ పొలాలకు వెళ్లేలా దారి ఏర్పాటు చేయాలని రైతులు కోరుతున్నారు.డిజైన్‌లో నిర్మించాలని లేదు..రహదారి నిర్మాణంలో భాగంగా నీళ్లు పోవడానికి డ్రెయిన్‌లు నిర్మిస్తున్నాం. రహదారి నిర్మాణ డిజైన్‌లో డ్రెయిన్‌లపై ర్యాంప్స్ నిర్మించాలని లేదు. ఎవరైన రైతులు తమ పొలాలకు పోవడానికి దారి కావాలని అడిగితే ర్యాంపులు నిర్మిస్తున్నాం. అవసరమున్న రైతులు అడిగితే వారు తమ పొలాల్లోకి వెళ్లేలా ర్యాంపులు ఏర్పాటు చేస్తాం.

## హామీలు గాలికి.. దివ్యాంగులను

# మరచిన కాంగ్రెస్ ప్రభుత్వం

**రామాయంపేట -నవభూమి:** హామీలు ఇవ్వడం వాటిని అమలు చేయకపోవడం,అడిగితే ప్రతిపక్షాలపై నెట్టడం కాంగ్రెస్ ప్రభుత్వానికి అలవాటుగా మారింది. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల అమలు కోసం చాలా మంది ఎదురు చూస్తున్నారు. ఇందులో దివ్యాంగులు ఎంతో ఆతృతగా ఉన్నారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే వికలాంగులకు రూ.6 వేలు పెంచుతామని ప్రకటించింది. ఈ అంశం మెనిఫెస్టోలో సైతం పెట్టారు. కానీ ఇప్పటికి అమలు కాకపోవడం పట్ల వికలాంగులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు.గతంలో రూ.3016 ఉండగా అప్పటి కేసీఆర్ ప్రభుత్వం రూ.4016కు పెంచింది. అదే నేటికి అమలవుతుంది. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం ఆశలు పెంచడంతో వికలాంగులు మొదట్లో ఎంతో సంతోషం వ్యక్తం చేశారు. కానీ వారి ఆశలు అడియాశలయ్యాయి. దీంతో పలుమారు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినా పలితం లేకుండా పోయిందని వికలాంగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వికలాంగుల బాధలు అర్థం చేసుకొని కేసీఆర్ రూ.వెయ్యి పెంచారని, కానీ నేటి ప్రభుత్వం ఎంతమాత్రం పట్టించుకోవడం లేదంటున్నారు.వికలాంగుల ఆగ్రహానికి గురికావడం ఖాయం..వికలాంగుల భాదలు అర్థం చేసుకొని ఇచ్చిన హామీ అమలు చేయాలని వికలాంగుల సంఘం జిల్లా ఉపాద్యక్షుడు గంగాపురం సంజీవులు అన్నారు. లేకుంటే వికలాంగుల ఆగ్రహానికి గురి కవడం ఖాయం. లేని ఆశలు చెప్పి ఇప్పుడు అమలు చేయకపోవడం విడ్డూరంగా ఉంది. మెనిఫెస్టోలో పెట్టిన హామీలు అమలు చేయక పోవడం మంచిది కాదు. ముఖ్యంగా బస్సుల్లో ప్రయాణం మరీ కష్టంగా మారింది. మాకు కేటాయించిన సీట్లు కూడా దొరకడం లేదు. పెంచుతామన్న పెన్షన్ వెంటనే పెంచాలి. ఈ విషయంలో త్వరలోనే కార్యచరణ రూపొందిస్తాం.మా బాధలను అర్థం చేసుకోవాలి..దివ్యాంగులమైన తమకు అనేక భాదలు ఉంటాయని కుస్తి



సిద్దిరాములు అన్నారు. అందరిలాగా పనులు చేయలేక ఉంటున్న మాకు ఖర్చులు కూడా ఎక్కువగానే ఉంటాయి. వీటిని దృష్టిలో పెట్టుకొని ఇచ్చిన హామీమేరకు పెన్షన్ వెంటనే పెంచాలి. తాము ప్రభుత్వానికి వ్యతిరేకం కాదు. కానీ మాకు ఇచ్చిన హామీ అమలు కోసం మాత్రమే మా తాపత్రయమన్నారు.కేసీఆర్ ఉంటే ఈ భాద ఉండేది కాదు..గతంలో మా భాదలను అర్థం చేసుకొని కేసీఆర్ ప్రభుత్వం రూ.వెయ్యి పెంచిందని మధునాల ఎల్లాగౌడ్ అన్నారు. అధికారంలోకి రాకముందు వికలాంగులకు పెన్షన్ పెంచుతామని చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పుడు ఇన్ని నెలలు గడుస్తున్నా ఈ విషయంలో పట్టించుకోవడం లేదు. కేసీఆర్ ఉండి ఉంటే మాకు ఇలాంటి ఇబ్బంది ఉండేది కాదు. అడగకుండానే అప్పట్లో పెన్షన్ పెంచారు. ఇప్పుడు ఉండి ఉంటే బాగుండేదని చెప్పారు.

# కొర్రీలతో కొంపకొల్లేరు..

**సిద్దిపేట, -నవభూమి:** కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల పథకం ఆదిలోనే అభాసుపాలవుతున్నది. ఇందిరమ్మ ఇల్లు మంజూరైందని సంబురంగా పాత ఇంటిని కూలగొట్టుగొని కొత్త ఇంటి నిర్మాణం చేపట్టిన లబ్ధిదారుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. ఇంటి నిర్మాణం 400 చదరపు అడుగుల విస్తీర్ణానికి తక్కువ కాకుండా, 600 చదరపు అడుగులు విస్తీర్ణం దాటి చేపట్టవద్దని ప్రభుత్వం ఇటీవల ఆదేశాలు జారీచేసింది.ఇప్పటికే చాలామంది ఇంటి పనులు ప్రారంభించారు. తీరా ఇప్పుడు ప్రభుత్వం కొత్త నిబంధనలు తేవడంతో లబ్ధిదారులు ఆందోళనకు గురవుతున్నారు. ప్రభుత్వం ఆదేశాలతో అధికారులు ఇండ్ల సర్వేను మళ్లీ మొదలు పెట్టారు. నిబంధనలు లేని ఇండ్లను రద్దు చేస్తున్నారు. లేదా కట్టిన ఇల్లు ఉంటే ఆ చదరపు అడుగుల్లోపు కుదించుకోవాలని అధికారులు సూచిస్తుండంతో లబ్ధిదారులు ఇల్లు కట్టాలా? వద్దా? అనే మీమాంసలో ఉన్నారు. పాత ఇల్లు పోయింది.. కొత్త ఇల్లు వచ్చే అవకాశం లేకుండా పోయిందని నిరుపేదలు వాపోతున్నారు.ఉమ్మడి మెదక్ జిల్లాలో అయోమయంలో లబ్ధిదారులు ఇందిరమ్మ ఇండ్లు మంజూరుకు సంబంధించి ప్రభుత్వం స్పష్టమైన విధివిధానాలు ప్రకటించక పోవడంతో లబ్ధిదారులు ఇబ్బందులు పడుతున్నారు.తొలుత అందరికీ ఇందిరమ్మ ఇండ్లు అని చెప్పిన ప్రభుత్వం ఇప్పుడు నిబంధనలు మార్చింది. ప్రతి మండల కేంద్రంలో ఒక పైలట్ గ్రామాన్ని ఎంపిక చేసి ఇందిరమ్మ ఇండ్లకు అర్హులైన వారికి ప్రొసీడింగ్‌లు ఇచ్చింది. ప్రభుత్వం చెప్పిన మాటలతో ఉన్న ఫలంగా ఇంటిని కూలగొట్టి దాని అడుగులోనే ఇందిరమ్మ ఇండ్లకు ముగ్గులు పోసుకున్నారు పేదలు.

# ఆదిలాబాద్ జిల్లాలో స్క్రాప్ దుకాణాలపై దాడులు.. అనుమానాస్పద వస్తువులు స్వాధీనం



**ఆదిలాబాద్-నవభూమి:** ఆదిలాబాద్ జిల్లాలో అసాంఘిక కార్యకలాపాలను పూర్తిగా రూపుమాపాలనే ఉద్దేశంతో ఏకకాలంలో 35 బృందాల చేత పది మండలాల్లో స్క్రాప్ దుకాణాలపై మూకుమ్మడిగా తనిఖీలు నిర్వహించినట్లు జిల్లా ఎస్పీ అఖిల్ మహజన్ తెలిపారు. దొంగలించిన వస్తువులను స్క్రాప్ దుకాణాలు ఎలాంటి పరిస్థితుల్లోనూ కొనవద్దని, కొన్న వారిపై చట్టపరమైన కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.ఆదిలాబాద్ వన్ టౌన్, టూ టౌన్, మావల, బేల, ఇంద్రవెల్లి, ఇచ్చోడ, గుడిహత్నూర్, నేరడిగొండ నార్నూర్, బోథ్ మండలాల్లో ఏకకాలంలో స్క్రాప్ దుకాణాలలో జిల్లా పోలీసు బృందాలు తనిఖీలు నిర్వహించినట్లు తెలిపారు. 13 స్క్రాప్ దుకాణాల వద్ద పలు వస్తువులు లభ్యమైనట్లు జిల్లా ఎస్పీ పేర్కొన్నారు. ఆయా పోలీస్ స్టేషన్‌లో కేసులు నమదు చేస్తున్నట్లు తెలిపారు. దొంగలించిన బడ్డ సరుకు, వస్తువులను, వాహనాలను, రాగి లాంటి లోహాలను కొన్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# నిర్మల్‌లో ఘోర రోడ్డుప్రమాదం.. తండ్రీకూతురు దుర్మరణం



**నిర్మల్:-నవభూమి:** నిర్మల్ జిల్లా నీలాయిపేట వద్ద ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఆదివారం తెల్లవారుజామున నీలాయిపేట వద్ద డీసీఎం, కారు ఢీకొన్నాయి. దీంతో కారు ముందుభాగం నుజ్జునుజ్జు కావడంతోపాటు వెనుక టైర్ ఊడిపోయింది. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న తండ్రీ కూతురు అశోక్ (45), కృతిక (20) అక్కడికక్కడే మృతిచెందారు.కారు డ్రైవర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని సహాయకచర్యలు చేపట్టారు. క్షతగాత్రుని దవాఖానకు తరలించారు. అతివేగమే ప్రమాదానికి కారణమని ప్రాథమికంగా నిర్ధారించారు. ఈ ఘటనపై కేసు నమోదుచేసి దర్యాప్తుచేస్తున్నామన్నారు.

# స్రాప్ దుకాణాలపై దాడి

**ఎదులాపురం, -నవభూమి:** అసాంఘిక కార్యకలాపాలను పూర్తిగా రూపుమాపాలనే ఉద్దేశంతో ఆదిలాబాద్ జిల్లావ్యాప్తంగా ఏకకాలంలో 35 బృందాలతో పది మండలాల్లోని స్రాప్ దుకాణాలపై పోలీసులు మూకుమ్మడి తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ అఖిల్ మహాజన్ మాట్లాడుతూ.. దొంగ వస్తువులను కొన్న, కొనడానికి యత్నించిన వారిపై కేసులు నమోదు చేస్తామన్నారు.ఆదిలాబాద్ వన్ టౌన్, టూ టౌన్, మావల, బేల, ఇంద్రవెల్లి, ఇచ్చోడ, గుడిహత్నూర్, నేరడిగొండ నార్నూర్ బోథ్ ఏకకాలంలో స్రాప్ దుకాణాలలో పోలీసు బృందాలు తనిఖీలు నిర్వహించామన్నారు. 13 స్రాప్ దుకాణాల వద్ద పలు వస్తువులు లభ్యమైనట్లు తెలిపారు. లభ్యమైన షాపులపై ఆయా పోలీస్ స్టేషన్‌లో కేసులు నమోదు చేస్తున్నట్లు తెలిపారు.



# లైంగిక వేధింపులకు పాల్పడ్డ ఒకరి అరెస్టు




**ఎదులాపురం, -నవభూమి:** మహిళ ఫొటోతో సోషల్ మీడియాలో ఫేక్ బుక్ అకౌంట్ క్రియేట్ చేసి లైంగిక వేధింపులకు గురి చేసిన పంజాబ్ రాష్ట్రానికి చెందిన అసిస్టెంట్ ట్రెజరర్ మునీష్ కుమార్‌ను అరెస్టు చేసినట్లు వన్ టౌన్ సీఐ సునీల్ కుమార్ తెలిపారు. విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడించారు. ఆదిలాబాద్ పట్టణానికి చెందిన మహిళ బంధువులు పంజాబ్ రాష్ట్రంలోని అమృత్‌సర్‌లో ఉంటున్నారు. కొన్ని రోజుల కింద మహిళ ఆమె భర్తతో కలిసి అమృత్‌సర్ లో ఉంటున్న తమ బంధువుల ఇంటికి వెళ్లారు.పని నిమిత్తం అమృత్‌సర్‌కు చెందిన అసిస్టెంట్ ట్రెజరర్ మునీష్ కుమార్‌ను సంప్రదించారు. ఆయన డబ్బులు డిమాండ్ చేయడంతో అక్కడి విజిలెన్స్ అధికారులకు పట్టించారు. ఈ కారణంగా వారిపై కక్షసాధింపు చర్యల్లో భాగంగా ఆయన ఆదిలాబాద్‌కు చెంది న మహిళపై ఫేక్ ఫేస్‌బుక్ ఐడీని క్రియేట్ చేశాడు.ఫేస్‌బుక్‌లో మహిళ చిత్రాలను మార్ఫింగ్ చేసి ఫేస్‌బుక్‌లో ఉంచి లైంగిక వేధింపులకు గురి చేశాడు. దీంతో బాధిత మహిళ వన్ టౌన్‌లో ఫిర్యాదు చేసింది. ఆదిలాబాద్ సైబర్ క్రైమ్ బృందం సహకారంతో ఒకటో పట్టణ పోలీస్ స్టేషన్ సిబ్బంది నిందితుడిని గుర్తించి అమృత్‌సర్ నుంచి ఆదిలాబాద్‌కు తీసుకొచ్చారు. మునీష్ కుమార్‌పై కేసు నమోదు చేసి అరెస్టు చేసినట్లు తెలిపారు.

# మళ్లీ బీఆర్ఎస్ అధికారంలోకి వస్తుంది..



**ఎదులాపురం,-నవభూమి:** రానున్న రోజుల్లో బీఆర్ఎస్ పార్టీ మళ్లీ అధికారంలోకి వస్తుందని తెలంగాణ జాగృతి వ్యవస్థాపక అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అన్నారు. తెలంగాణ జాగృతి ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షుడు రంగినేణి శ్రీనివాస్‌రావు శనివారం హైదరాబాద్‌లోని కల్వకుంట్ల కవిత నివాసంలో కుటుంబ సమేతంగా మర్యా ద పూర్వకంగా కలిశారు.ముందుగా ఆదిలాబాద్ జిల్లాలో జాగృతి ఆధ్వర్యంలో చేపట్టిన, చేపట్టబోయే సేవా కార్యక్రమాలను చర్చించారు. క్షేత్రస్థాయిలో జాగృతి బలపర్చాలని కవిత సూచించారు. ప్రజల సమస్యలను ప్రశ్నిస్తూ, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని పేర్కొన్నారు. మళ్లీ వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని ఆశాభావం వ్యక్తం చేశారు.

# బోరిగాంలో ఉద్రిక్తత..



**ముధోల్-నవభూమి:** ముధోల్ మండలంలోని బోరిగాం గ్రామంలో హనుమాన్ విగ్రహం సమీపాన సోమవారం ఉదయం ప్రభుత్వ భూమిలో బుద్ధ విగ్రహం ప్రతిష్టించడంతో గ్రామంలో ఉద్రిక్తతకు దారి తీసింది. గ్రామంలోని ఇరు గ్రూపులు రాళ్లతో దాడి చేసుకున్నారు .ఈ దాడిలో పలువురు గాయపడ్డారు. వారిని బైంసా ఆస్పత్రికి తరలించారు. ఈవిషయం తెలుసుకున్న ముధోల్ పోలిసులతో పాటు, నిర్మల్ జిల్లా నుండి ఎస్ఐ లు, సిఐ లు పోలిసులు భారీ సంఖ్యలో తరలి వచ్చారు. అలాగే నిర్మల్ జిల్లా ఎస్పీ జానకి షర్మిల వెంటనే తనతో పాటు ఇటివల మహిళా కానిస్టేబుల్ తో ఏర్పాటు చేసిన శివంగీ టీంతో సంఘటన స్థలానికి చేరుకున్నారు. దీంతో ఎక్కువ మంది గూమిగూడిన గ్రామ మహిళలను మహిళా పోలిసులు చెదరగొట్టారు. ఎస్పి, అడిషనల్ ఎస్పీ అవినాష్ కూమార్, భైంసా ఆర్టీవో కోమల్ రేడ్డి, తహశీల్దార్ శ్రీకాంత్ రంగంలోకి దిగి ఇరు గ్రూపులను సముదాయించారు. వారు వినకపోవడంతో పరిస్థితి చేయి దాటకుండా ఎస్పీ చాకచక్యంగా వ్యవహరించి వెంటనే సంఘటన స్థలం నుండి తమ పోలిస్ సిబ్బందితో ఇరుగ్రూపులను చెదరగొట్టించారు. సంఘటన స్థలానికి ఎవరిని రాకుండా కట్టుదిట్టమైన భద్రత చర్యలు పోలిసులు తీసుకున్నారు. ప్రభుత్వం భూమిలో అనుమతి లేకుండా ప్రతిష్టించిన బుద్ధ విగ్రహాన్ని భారీ పోలిస్ భద్రత మధ్య రెవెన్యూ అధికారులు వెంటనే విగ్రహాన్ని తొలగించి, ముధోల్ తహశీల్దార్ కార్యాలయానికి తరలించారు. ఈ గొడవకు కారణం అయిన పలువురిని పోలిసులు అదుపులోకి తీసుకున్నారు. భైంసా అడిషనల్ ఎస్పీ అవినాష్ కుమార్ ఆధ్వర్యంలో ముధోల్ సిఐ మల్లేష్ తో పాటు భారీ సంఖ్యలో పోలిసులు బోరేగంలో పికెటింగ్ తో పాటు, పోలిస్ బందోబస్తును నిర్వహిస్తున్నారు.

# దేశ రక్షణలో జవాన్‌ల సేవలు మరువలేనివి



**బజార్ హత్నూర్:-నవభూమి:** దేశ రక్షణలో జవాన్‌ల సేవలు మరువలేనివని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాధవ్ అన్నారు. మండలంలోని జాతర్ల గ్రామానికి చెందిన ఆర్క మేఘనాథ్ సీఆర్పీఎఫ్ జవాన్ జార?ండ్ లో విధులు నిర్వహిస్తూ అనారోగ్యంతో మృతి చెందిన విషయం తెలుసుకున్న బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాధవ్ సోమవారం వారి స్వగ్రామం జాతర్లలో జరిగిన అంతః క్రియల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మేఘనాథ్ భౌతికకాయానికి పూల మాల వేసి నివాళులర్పించి, కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కుటుంబానికి దూరంగా వెళ్లి దేశ సేవ చేసే అవకాశం దొరకడం అదృష్టమని, అనారోగ్యంతో జవాన్ మేఘనాథ్ చనిపోవడం బాధాకరమని, మేఘనాథ్ ఆత్మకి శాంతి చేకూరాలని కోరారు. మేఘనాథ్ కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉండేలా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానన్నారు. గిరిజన శాఖ ద్వారా కుటుంబానికి న్యాయం జరిగిలా చూస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆయా మండలాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రజావాణి సమస్యలను సత్వరం పరిష్కారించాలి

**సిద్ధిపేట,-నవభూమి:** ప్రజావాణి కార్క్రయకమంలో వచ్చే సమస్యలకు అధిక ప్రాధాన్యతనిస్తూ వచ్చిన ఫిర్యాదులకు సత్వరమే పరిష్కార చూపాలని కలెక్టర్ ఎం.మను చౌదరి అన్నారు. సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్క్రయకమంలో అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్‌తో కలిసి ప్రజల నుండి ఫిర్యాదులు, వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మనుచౌదరి మాట్లాడుతూ.. సమస్యల పరిష్కారం కోరుతూ జిల్లా కేంద్రంతో పాటు జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి ప్రజలు ఎన్నో వ్యయప్రయాలకు ఓర్చి వస్తారన్నారు.అధికారులు ఆయా శాఖల వారీగా స్వీకరించిన ఫిర్యాదులపై సానుకూలంగా వ్యవహరించడంతో పాటు సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. అర్జీలను పెండింగ్ లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ, సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. మొత్తం 49 ఫిర్యాదులను వెంటనే సంబంధిత అధికారులను పరిష్కరించే విధంగా తగు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్క్రయకమంలో డీఆర్ఓ నాగ రాజమ్మ, వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

